సాక్షి కామారెడ్డి

శనివారం । 10 । జూన్ । 2023



బస్టాండ్ ఉన్నా అవస్థలే..

నాగిరెడ్డిపేటలోని గోపాల్‌పేటలో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

- 9లో ▸



లోతు దుక్కులతో మేలు..

పొలాల్లో లోతు దుక్కులు దున్నితే భూసారం పెరగడంతో పాటు చీడపీడలు నివారించవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.9 /27.4

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. సాయంత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

బృందావనంలా పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్



పెద్దకొడప్‌గల్(జుక్కల్) :మండలంలో పోలీస్‌స్టేషన్‌ను బృందావనంగా మార్చారని పెద్దకొడప్‌గల్ పోలీస్‌స్టేషన్లు ఇతర స్టేషన్లు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్, ఫ్లవర్ గార్డెన్‌ను శుక్రవారం ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి కలిసి ప్రారంభించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాతుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన స్విమింగ్ పూల్‌ని చూసి ప్రశంసించారు. ఎస్సై కోనారెడ్డి, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, ఎస్సై కోనారెడ్డి, ఏఎస్సై రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ అన్యోన్యకు పదోన్నతి

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ జే. అన్యోన్యకు నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది నాన్ క్యాడర్ అడిషనల్ ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ హోంశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో కామారెడ్డి అదనపు ఎస్పీ అన్యోన్యను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. జిల్లా అధికారులు వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశించారు.

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో..

ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఏసీపీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి లభించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం రాత్రి ప్రిన్సిపాల్ సెక్రెటరీ డాక్టర్ జితేందర్ విడుదల చేశారు. నిజామాబాద్ ఎస్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న మధుసూదన్‌రావుకు పదోన్నతి లభించింది. ఆయన నిజామాబాద్ డీసీపీ అడ్మిన్‌గా కూడా పనిచేస్తున్నారు. ఆర్మూర్ ఏసీపీగా పనిచేస్తున్న ప్రభాకర్ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన ఇద్దరిని హైదరాబాద్‌లోని డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : ఈనెల 14 నుంచి 22 వరకు పదో తరగతి జరుగనున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం జూమ్ మీటింగ్‌లో భాగంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి 12:30 వరకు జరుగుతాయన్నారు. జూన్ 12 నుంచి 19 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్ పరీక్షల కోసం 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఈవో రాజు, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు పెరిగిన పింఛన్

- ఇకపై రూ.4,116 చెల్లింపు

సాక్షి, కామారెడ్డి : ఆసరా పథకం కింద వికలాంగులకు అందిస్తున్న పింఛన్‌ను మరో రూ.1,000 పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. వచ్చేనెల నుంచే అమలు చేస్తామని పేర్కొన్నారు. దీంతో వికలాంగులకు మంచి ప్రయోజనం కలుగనుంది. ఇప్పటికే ప్రభుత్వం నెలనెలా రూ.3,116 పింఛన్ అందిస్తోంది. మరో రూ.వెయ్యి పెంచడంతో నెలవారి పింఛన్ రూ.4,116 కు చేరనుంది. జిల్లాలో 18,896 మంది వికలాంగులు పింఛన్ పొందుతున్నారు. మరికొందరు పింఛన్ కోసం వరుసలో ఉన్నారు. పింఛన్ పెంపుదలతో వికలాంగులకు మంచి ప్రయోజనం కలుగనుంది. వచ్చేనెల నుంచే అమలు చేస్తామని సీఎం ప్రకటించారు. దీంతో వికలాంగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. నెలవారీ పింఛన్‌తో కుటుంబాలను నెట్టుకొస్తున్న లబ్ధిదారులకు పెరిగిన పింఛన్‌తో మరింత భరోసా కలుగనుంది.

సేవలు సరే.. సౌకర్యాలేవి..?

మేడిపండు చూడు మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడు పురుగులుండు అన్నట్లుగా తయారైంది కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి పరిస్థితి. ఆస్పత్రిలో పార్కింగ్ స్థలం లేని కారణంగా శుక్రవారం మున్సిపల్ వాటర్ ట్యాంకర్ మలుపు తిప్పుతుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో ఆస్పత్రి అంతా శుక్రవారం అంధకారంగా మారింది. పట్టణ నడిబొడ్డున 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి భవనంలో 32 విభాగాలతో సేవలు ఒక్కొక్కటిగా పెంచుతూ వెళ్లినప్పటికీ స్థలాభావం కారణంగా పూర్తి స్థాయిలో రోగులకు సౌకర్యాలందట్లేదు. – కామారెడ్డి టౌన్

- స్థలం సరిపోక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఇబ్బందులు
- పడకలు పెంచినా వసతుల్లేని వైనం..
- అరకొర సిబ్బంది, పడకలకూ స్థలం లేదు..
- వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులే..
- 230 పడకలతో వైద్య కళాశాల ప్రారంభమైతే మరిన్ని కష్టాలు..

ఆస్పత్రిలో కరెంట్ లేక చిన్నారులను తల్లులకు ఇచ్చేయగా ఖాళీగా ఉన్న ఇంక్యూబెటర్‌లు





జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఐసీయూలో కరెంట్ లేక ఇబ్బందులు పడుతున్న రోగులు



చీకట్లోనే పనిచేస్తున్న సిబ్బంది

కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి 100 పడకలతో రోగులకు వైద్యసేవలందిస్తోంది. నూతన జిల్లా ఏర్పడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రిగా మారింది. ప్రసవాలు, రోగుల తాకిడి పెరగడంతో రెండేళ్ల క్రితం మొదటి అంతస్తులో రేకుల షెడ్డు, పీవోపి వేసి అదనంగా 30 పడకలను పెంచారు. ప్రస్తుతం 130 పడకలతో ఆస్పత్రి కొనసాగుతుంది. ఈ ఇరుకు భవనంలోనే ఈవోపీ, ఐపీ, ట్రామాకేర్, ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, మహిళా, పురుషుల, ఆరోగ్యశ్రీ ఇన్‌పేషెంట్ వార్డులు, డయాలసీస్, కేంద్రీకృత ల్యాబ్, బ్లడ్ బ్యాంక్ ఇలా సుమారు 32 విభాగాలు ఈ భవనంలోనే ఉన్నాయి. ఆస్పత్రిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. నిత్యం మున్సిపల్ వాటర్ ట్యాంకర్లతో సంపులో నీటిని నింపుతు అరకొరగా అందిస్తున్నారు.

రోడ్లమీదే వాహనాలు..

ఆస్పత్రికి నిత్యం వందలాది రోగులు వాహనాలతో వస్తుంటారు. వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది కూడా కార్లు, వాహనాల్లో వస్తున్నారు. 108, 102, ఆస్పత్రి అంబులెన్స్‌లు ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్‌లోనే ఉంటాయి. ఇరుకు స్థలంలో ఉన్న ఆస్పత్రి ఆవరణలో బైక్ పార్క్ చేయాలన్నా ఇబ్బందిగా మారుతోంది. స్థలం సరిపోక ఆస్పత్రి బయట రోడ్లు, సుభాష్‌రోడ్‌లో కూడా ఆస్పత్రికి వచ్చేవారు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. శుక్రవారం మార్చురి వద్ద ప్రైవేట్, ఆస్పత్రి అంబులెన్స్‌లు ఉండటంతో వాటర్ ట్యాంకర్ వెళ్లడానికి వీలుకాక డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు.

నాలుగు వార్డులకు ఒక నర్సు..

ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది లేరు. ఉన్న వారితో వైద్య సేవలను నెట్టుకొస్తున్నారు. ఒక్క నర్సు నాలుగు వార్డులను చూసుకోవాల్సి వస్తుంది. స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు పోస్టులు 130 పడకలతో పోల్చితే 25 మందికిపైగా ఖాళీలుగా ఉన్నాయి. 100 పడకలకే అరకొరగా సిబ్బంది ఉంటే.. 130 పడకలకు పెంచినప్పటికీ సిబ్బందిని మాత్రం పెంచలేదు. మెడికల్ కళాశాల మంజూరుతో ఎస్ఆర్ వైద్యులు రావడంతో వైద్యులతో ఇబ్బందులు లేకున్నా, సర్జన్‌లు లేక వైద్య సేవలు అందటం లేదు. ప్రధానంగా ఆరుగురు సర్జన్‌లు, గైనిక్ వైద్యులు ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు.

దీంతో గర్భిణులను బయటకు రిఫర్ చేస్తున్నారు. వైద్యసిబ్బంది కొరత కారణంగా సేవలందక ఓ విద్యార్థిని ఇటీవలే మృతి చెందింది. గైనిక్ వైద్యులు లేక శిశువుల మరణాలు పెరుగుతున్నాయి.

రెండు శాఖల మధ్య సమన్వయలోపం..?

జిల్లాకు వైద్య కళాశాల మంజూరుతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్న ఆస్పత్రి త్వరలో డీఎంఈ (డైరక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి వెళ్తుంది. ప్రస్తుతం టీవీవీపీ, డీఎంఈ పాలన విభాగాలు ఇందులోనే కొనసాగుతున్నాయి. దీంతో రెండు శాఖల మధ్య సమన్వయలోపం ఏర్పడవచ్చని పలువురు పేర్కొంటున్నారు. వైద్య కళాశాల వైద్యులు, ప్రిన్సిపాల్‌లు, ప్రొఫెసర్లు ఉన్నారు. టీవీవీపీ వైద్యులు, సిబ్బంది ఉన్నారు. ఆస్పత్రి రెండో అంతస్తులో రేకుల షెడ్డుతో మరో 100 పడకలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 130 పడకలకే భవనం సరిపోవడం లేదంటే ఇక 230 పడకలతో వైద్య కళాశాల ప్రారంభమైతే క్లిష్ట పరిస్థితులు మారే అవకాశాలున్నాయి.

జిల్లా ఆస్పత్రిలో రోజంతా అంధకారం

- ఆపరేషన్లు, సిజేరియన్లు నిలిపివేత
- ఇబ్బందులు పడ్డ రోగులు, సిబ్బంది

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోజంతా అంధకారం నెలకొంది. ఆస్పత్రిలోని విద్యుత్ స్తంభానికి మున్సిపల్ వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆస్పత్రిలో రోగులతో పాటు, శిశువులు, వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆపరేషన్లు, సిజేరియన్లు నిలిచిపోయాయి. ఆస్పత్రిలో నీటి ఎద్దడి కారణంగా నిత్యం మున్సిపల్ ట్యాంకర్‌తో ఆస్పత్రి వెనకాల ఉన్న సంపులో నీళ్లు నింపుతారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ట్యాంకర్ వచ్చి నీళ్లను సంపులో పోశారు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను మలుపు తిప్పడంతో మార్చురి వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి వైర్లు కింద పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం ట్రాన్స్‌కో సిబ్బంది శుక్రవారం రాత్రి 7.15 గంటల వరకు కూడా మరమ్మతులు చేస్తూనే ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆస్పత్రి అంతా అంధకారంలోనే ఉంది. కరెంట్ లేకపోవడంతో సీజరియన్‌లు, ఇతర ఆపరేషన్లు నిలిపేశారు. అత్యవసరంగా ఉన్న గర్భిణులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేశారు.



ఆస్పత్రిలో ట్యాంకర్ ఢీకొట్టగా విరిగిన స్తంభం

అల్లాడిన చిన్నారులు..

ఐసీయూ, పురుషుల, జనరల్, చిన్నపిల్లలు, ఆరోగ్యశ్రీ, ఈవోపీ వార్డుల్లో కరెంట్ లేకపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఎస్ఎన్‌సీయూలో కరెంట్ లేక చిన్నారులను తల్లులకు అప్పజెప్పారు. లేబర్ రూంలో గర్భవతులు, బాలింతలు అవస్థలు పడ్డారు. వైద్యులు, సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు.

అసలే ఎండలు మండిపోతుండగా రోజంతా కరెంట్ లేకపోవడంతో రోగులు భరించలేకపోయారు. కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి రాత్రి 7.15 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆస్పత్రిలో ఉన్న చిన్న జనరేటర్ ద్వారా డయాలసీస్, బ్లడ్ బ్యాంక్‌కు మాత్రం విద్యుత్ సరఫరా అందింది.



ఆస్పత్రిలోని జనరల్ వార్డులో రోగుల అవస్థలు



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

ఆస్పత్రి భవనం ఇరుకుగా ఉండటం వాస్తవమే. కానీ ప్రజలకు వైద్య సేవలు మాత్రం అంతరాయం కలుగకుండా అందిస్తున్నాం. ఆస్పత్రి సమస్యలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. సమస్యలపై దృష్టి సారిస్తాం.

– డాక్టర్ విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్

అన్ని వర్గాలకు ఆర్థిక చేయూత



చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్



మద్నూర్‌లో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింధే

కామారెడ్డి రూరల్ : బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాలకు ఆర్థిక చేయూతనిస్తుందని ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి లక్ష్మీదేవిగార్డెన్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కులవృత్తుల ఆర్థిక సహాయం కోసం 10 మందికి రూ. లక్ష చొప్పున రూ.10 లక్షలు, బీబీ పేట మండలం మందాపూర్, జనగామకు చెందిన 21 మంది లబ్ధిదారులకు పట్టా సర్టిఫికెట్లను అందించారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశంలో ఏ రాష్ట్రంలోనూ కనిపించదని ఎవరైనా రుజువు చేస్తే ఎలాంటి చర్చకైనా సిద్ధమన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలకు, కేంద్రంలో ఉన్న బీజేపీ పార్టీలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన పథకాల ద్వారా అభివృద్ధి పొందలేదని చెప్తే నేను ముక్కు నేలకు రాసి తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. బీసీ కుల సంఘాల వారికి రూ. లక్ష చెక్కును అందజేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న ఇద్దరు జంటలకు రూ. 2 లక్షల 50 వేలు ఇన్సూరెన్స్ బాండును అందజేశారు. బీసీ కులాలకు సంబంధించిన వారు ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఎంకె ముజీబొద్దీన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, జెడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఆర్డీవో వాణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, రాంరెడ్డి, తిర్మల్‌గౌడ్, ఎంపీపీ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మద్నూర్(జుక్కల్) : కుల వృత్తులు, పేద ప్రజల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే పేర్కొన్నారు. మద్నూర్ మండల కేంద్రంలోని మైథీల ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జుక్కల్ నియోజికవర్గ స్థాయిలో సంక్షేమ ఉత్సవాన్ని నిర్వహించారు. సీఎం కేసీఆర్ పల్లెలను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపారని మాజీ జెడ్పీ చైర్మెన్ రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు తదితరులున్నారు.

కులవృత్తిదారులను ఆదుకుంటాం

- లబ్ధిదారులకు రూ. లక్ష చెక్కుల పంపిణీ
- రాష్ట్రంలో మొదటగా బాన్సువాడ నియోజకవర్గంలో అందజేత
- 26వ తేదీ నుంచి గిరిజనులకు పోడు పట్టాలు
- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో కులవృత్తుల లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ, నస్రుల్లాబాద్ : సంక్షేమ, అభివృద్ధి రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నస్రుల్లాబాద్ మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన సంక్షేమ సంబురాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కులవృత్తులకు ఆర్థికసాయం పథకంలో భాగంగా బాన్సువాడలో మొదటి లబ్ధిదారుడికి రూ. లక్ష చెక్కును అందజేస్తున్నట్లు స్పీకర్ అన్నారు. ఈ ఆర్థికసాయం పూర్తి సబ్సిడీ అని పేర్కొన్నారు. ఈనెల 20 వరకు బీసీ కుల వృత్తుల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గతంలో ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులు పనిచేయవని, అందరు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దళిత బంధు పథకం కింద నియోజకవర్గంలో 1100 మంది దళితులకు రుణాలు అందజేస్తామన్నారు. ఈ నెల 26న పోడు భూములకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు. పోడు పట్టాలు వచ్చిన వారికి రైతు బీమా, రైతు బంధు వర్తిస్తుందన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు..

బాన్సువాడ నియోజకవర్గంలో ఒక్కటైన నస్రుల్లాబాద్ మండలంలో 17 జీపీలుంటే ఇప్పటివరకు 183 మందికి రైతు బీమా, 9,839 మంది రైతులకు రైతుబంధు, 764 మందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు, 4,289 మందికి పింఛన్లు ఇచ్చామన్నారు. అలాగే 1,050 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సాయం, 1,330 మందికి కేసీఆర్ కిట్‌లు, 275 మందికి న్యూట్రిషన్ కిట్లు, 636 మందికి గొర్రెల పంపిణీ, 27 మందికి (నాయిబ్రాహ్మణులు, రజకులు) ఉచిత విద్యుత్ సరఫరా, 65 మందికి ట్రాక్టర్లు, హార్వేస్టర్లు పంపిణీ చేశామన్నారు. ఇలా ఒక్క మండలంలోనే 18,635 మందికి వివిధ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మండలంలో 416 మంది మహిళలకు రూ.కోటి 13 లక్షల వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారు. ఇప్పటి వరకు ఆసరా పింఛన్ల ద్వారా రూ. 58 కోట్లు ఇచ్చామని అన్నారు. ఒక్కొక్క ఇంటికి రెండు, మూడు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, త్వరలో కొత్త పింఛన్లు కూడా ఇస్తామని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.500 కోట్లతో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించామని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జెడ్పీచైర్మన్ దఫేదర్ శోభ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ముజీబ్, ఎంపీపీ పాల్వాయి విఠల్, నాయకులు జన్నుబాయి, స్వరూప, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, కిషోర్‌యాదవ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

బీసీలకు తీరని అన్యాయం..

- ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : సీఎం కేసీఆర్‌ని నమ్ముకుంటే ఇక రాష్ట్రాన్ని నట్టేట ముంచుతాడని మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి 150 మందికిపైగా యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీసీలకు తీరని అన్యాయం చేసి బీఆర్ఎస్ సంక్షేమ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని పాతర పెట్టి సాగనంపి ప్రజలు సంబురాలు చేసుకోనే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గతంలో తొమ్మిది లక్షల మంది బీసీ కార్పొరేషన్ లో ఉపాధి కోసం దరఖాస్తులు చేసుకుంటే వాటన్నింటిని రద్దు చేసి, ఇప్పుడు మాయల ఫకీరు మాటలు చెప్పి బీసీలను వంచించే ప్రయత్నం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం 15 రోజుల సమయం ఇచ్చి బీసీ లందరికీ సంక్షేమ పథకాలు అందిస్తానని బీసీలను మోసం చేస్తున్నాడని సీఎంను నమ్మవద్దని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 136 కులాలుంటే అందులో కేవలం 15 కులాలకు మాత్రమే లబ్ధిదారుల జాబితాలో పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రం దివాలా దిశగా పయనిస్తుందని, దోపిడి రాజకీయాలు,కాంటాక్ట్ కమీషన్‌లు వలన ప్రజలు చావుకు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకుంటామన్నారు. అర్హులందరికి పక్కా ఇండ్లు కట్టిస్తామని, రూ. 500లకే రేషన్ దుకాణాల ద్వారా గ్యాస్ సిలిండర్, నిత్యావసర సరులకు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యువకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండ్ల రాజు, ఐరెని సందీప్, శ్రీనివాస్, గూడెం శ్రీనివాస్, కారంగుల అశోక్‌రెడ్డి, సిరాజుద్దిన్, చందు, ప్రవీన్ తదితరులున్నారు.



పట్టణంలోని 20వ వార్డులో సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

రిమాండ్ ఖైదీ మృతి..!



నర్సింలు (ఫైల్)

కామారెడ్డి క్రైం : రిమాండ్ ఖైదీ మృతి చెందిన ఘటన కామారెడ్డిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠాను పట్టణ పోలీసులు మే 30న పట్టుకున్నారు. ఈ కేసులో కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన భూమన్నగారి నర్సింలు (40) ఏ2 నిందితుడిగా ఉన్నాడు. ఏ-1 నిందితుడు రెహమాన్ బైక్‌లను చోరీ చేయగా, నర్సింలు బైక్‌లను అమ్మి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. వీరిద్దరికి కామారెడ్డి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా కేంద్రంలోని సబ్‌జైలుకు తరలించారు. పది రోజులుగా సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నర్సింలు రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడిని మొదట జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింలు గురువారం రాత్రి మృతి చెందాడు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిమాండ్ ఖైదీ మృతి చెందడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. కడుపునొప్పి, బీపీ, ఫిట్స్ లాంటి అనారోగ్య కారణాలతోనే అతడు ఆస్పత్రిపాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఆరోగ్య పరీక్షలు చేయించిన తర్వాత ఎలాంటి సమస్యలు లేవని వైద్యులు ధ్రువీకరించిన తర్వాతనే ఎవరినైనా రిమాండ్‌కు పంపుతారు. అలాంటిది రిమాండ్ ఖైదీ అనారోగ్య కారణాలతో మృతి చెందడం ఏమిటనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనపై విచారణ జరిగాకే రిమాండ్ ఖైదీ మృతిపై స్పష్టత రావచ్చంటున్నారు. మృతుడు నర్సింలు గతంలోనూ పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చాడు.

క్లుప్తంగా

స్పౌజ్ బదిలీలు చేపట్టాలని వినతి



నిజామాబాద్‌నాగారం/నిజామాబాద్ అర్బన్: స్పౌజ్ బదిలీలు చేపట్టి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ కవితను ఉపాధ్యాయినులు కోరారు. శుక్రవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి తమ సమస్యలను విన్నవించారు. జనవరిలో ప్రభుత్వం 615 స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలను మాత్రమే జరిపిందన్నారు. మిగిలిన 1500 భాష పండితులు, పీఈటిల స్పౌజ్ బదిలీల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్సీ కవిత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. టీచర్లు రాజేశ్వరి, మనోజ, వందన, గౌతమి, పర్వీనా, నరేష్, రాజు, స్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత



బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో ఈ నెల 14న నిర్వహించనున్న బాల్య వివాహాన్ని అధికారులు నిలిపివేశారు. గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికకు 14న వివాహం చేసేందుకు తల్లిదండ్రులు నిశ్చయించారు. సమాచారం తెలిసిన అధికారులు శుక్రవారం బాలిక కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఐసీపీఎస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఉపాధి కూలీలకు గాయాలు



ఎల్లారెడ్డి: ఉపాధిహామీ పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేసిన ఘటన మండలంలోని హాజీపూర్ తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన ఉపాధి కూలీలు శుక్రవారం ఉదయం తండా శివారులో మట్టి తవ్వకం పనులు చేపడుతుండగా తేనెటీగలు దాడి చేశాయి. కూలీలు దేవులా, సరిచంద్, సేవ్యాలు గాయపడటంతో స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో చిన్నారికి..



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్‌లో విద్యుత్ షాక్‌తో ఓ చిన్నారికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన హైమద్ కూతురు ఆయేషా(4) ఇంట్లో ఎయిర్ కూలర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. ప్రమాదంలో చిన్నారి కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో నాలుగు రోజులుగా విద్యుత్ సమస్య నెలకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి విద్యుత్ సరఫరా జరిగే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని చెప్పారు. సమస్య పరిష్కరించాలని ట్రాన్స్‌కో సిబ్బందికి తెలిపినా పట్టించుకోలేదన్నారు. దీంతోనే చిన్నారికి షాక్ తగిలిందని ఆరోపించారు.

నిర్లక్ష్యం నీడలో..!

జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం
- శిథిలావస్థకు చేరిన హెచరీ గది
- ఇంకా ప్రారంభం కాని ఉత్పత్తి ప్రక్రియ



చుక్క నీరు లేని సిమెంట్ కుండీలు



శిథిలావస్థలో హెచరీ గది

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన నిర్మించిన జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నిర్లక్ష్యపు నీడలో మగ్గుతోంది. జిల్లాలో స్వయంగా చేప పిల్లలను ఉత్పత్తి చేసే కేంద్రం ఎస్సారెస్పీ ఒకటే. అలాంటి కేంద్రాన్ని పాలకులు పట్టించుకోవడం లేదు. పేరుకు జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం అయినా అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉంది. కేంద్రంలో జార్ హెచరీ గది శిథిలావస్థకు చేరింది. నీటి సరఫరాకు ఇబ్బందులు ఉన్నాయి. సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ కేంద్రంలో యేటా ఐదు కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేయొచ్చు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్రం పునరుద్ధణ కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో సిమెంట్ కుండీలు, కార్యాలయ భవనం పనులు చేపట్టారు. కానీ అనుకున్నంత స్థాయిలో అభివద్ధి జరగ లేదు. మూడు కోట్ల సామర్థ్యం ఉన్న చేప పిల్లల కేంద్రాన్ని 5 కోట్ల సామర్థ్యానికి పెంచారు. కానీ అందుకు కావాల్సిన వసతులు కల్పించలేదు.

చేప పిల్లల ఉత్పత్తికి నీటి కొరత

చేప పిల్లల ఉత్పత్తికి నీటి కొరత తీవ్రంగా ఉంది. ఎస్సారెస్పీ దిగువనే ఉన్నా నీటి కొరత అంటే వింతగా ఉన్నా.. ఇదే నిజం. ప్రాజెక్ట్ నుంచి 1065 అడుగుల నీటి మట్టం వరకు కేంద్రానికి నీటి సరఫరా చేపట్ట వచ్చు. ప్రస్తుతం నీటి సరఫరా చేసే అవకాశం ఉంది. కానీ ప్రాజెక్ట్ నుంచి నీరందించే పైపు లైన్ పార్కు వద్ద లీకేజీ మయమైంది. 2014 నుంచి ఇప్పటి వరకు నూతన పైపులైన్ వేయలేదు. లీకేజీలకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చేప పిల్లల ఉత్పత్తికి నీటి కొరత తీవ్రంగా వేధిస్తుంది. కేంద్రం ఆవరణలో ఉన్న బావి నీటినే వినియోగిస్తున్నారు. ఆ బావిలో రెండు గంటల్లో నీరు ఖాళీ అవుతుంది. తల్లి చేపలకు కూడా నీరు అందించలేని దుస్థితి ఉంది. తల్లి చేపల నుంచి గుడ్లను తీసి హెచరీలో వేసి బాయిల్డ్ చేసి స్పాన్‌ను ఉత్పత్తి చేస్తారు. కేంద్రంలో జార్ హెచరీ పూర్తిగా శిథిలావస్థలకు చేరుకుంది. మూడేళ్ల క్రితం ఎకో హెచరీ ఏర్పాటు చేశారు. దానిని పట్టించుకనే వారే లేరు. చైనీస్ హెచరీలు నిర్మించిన ప్రయోజనం లేకుండా పోయింది. నీటి కొరతతో హెచరీలకు నీరు సరిపడక పలుమార్లు చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ ఫెయిల్ అయింది.

ముంచుకొస్తున్న సీజన్

చేప పిల్లల ఉత్పత్తి సీజన్ ముంచుకు వస్తుంది. జూన్ మొదటి వారం నుంచి చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభిస్తారు. కానీ నీటి కొరతతో ఇప్పటికీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. సమస్యల వలయంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం మగ్గడంతో ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో ఏటా సామర్థ్యంలో సగం కూడా చేప పిల్లల ఉత్పత్తి జరగడం లేదు. దీంతో చెరువుల్లో చేప పిల్లలు వదలడానికి టెండర్లు నిర్వహిస్తున్నారు.

అనారోగ్యంతో మాజీ జేడీపీ రవీందర్‌రెడ్డి మృతి



రవీందర్ రెడ్డి(ఫైల్)

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌కు చెందిన రాష్ట్ర మాజీ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(జేడీపీ) ప్రొద్దుటూరి రవీందర్ రెడ్డి(63) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. రవీందర్‌రెడ్డి నెల రోజుల క్రితం చెవికి సంబంధించిన ఇన్‌ఫెక్షన్‌తో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ఇన్‌ఫెక్షన్ బ్రెయిన్‌కు సోకడంతో రవీందర్‌రెడ్డి పరిస్థితి విషమించింది. ఈ క్రమంలో శుక్రవారం తీవ్ర అనారోగ్యానికి గురైన రవీందర్‌రెడ్డి ఆస్పత్రిలో మృతి చెందారు. కొటార్మూర్‌కు చెందిన రవీందర్ రెడ్డి 1992లో జహీరాబాద్ కోర్టులో ఏపీపీగా విధుల్లో చేరారు. అనంతరం పలు కోర్టుల్లో ఏపీపీగా విధులు నిర్వహించిన రవీందర్ రెడ్డి నిజామాబాద్ కోర్టులో అడ్మినిస్ట్రేషన్ పీపీగా విధులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం 2019లో రవీందర్ రెడ్డిని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమించింది. పదవిలో రెండేళ్ల కొనసాగిన ఆయన రెండు సంవత్సరాల క్రితం విరమణ పొందారు. రవీందర్ రెడ్డికి భార్య సుచరిత, కూతుళ్లు నిఖిత, లిఖిత ఉన్నారు. హైదరబాద్‌లోని కోంపల్లిలో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మాట్లాడుతూనే కుప్పకూలాడు

- గుండెపోటుతో వ్యాపారి మృతి



సత్యనారాయణ(ఫైల్)

మాచారెడ్డి : గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న వ్యక్తి మాట్లాడుతూనే గుండెపోటుతో మరణించాడు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా చౌరస్తాకు చెందిన వస్త్ర వ్యాపారి గుండ్లపల్లి సత్యనారాయణ (63) ఓ ప్లాటు విషయంలో గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చాడు. అక్కడ సిబ్బందికి తన ప్లాటు గురించి చెబుతూనే కుప్పకూలిపోయాడు. వెంటనే సిబ్బంది స్పందించి సీపీఆర్ చేశారు. కదలికలు లేకపోవడంతో చికిత్స నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అందరితో ఆప్యాయంగా ఉండే సత్యనారాయణ హఠాన్మరణంతో విషాదం అలుముకుంది.

ఎండీఎం బకాయిలు చెల్లించండి



ధర్నా చేస్తున్న ఎండీఎం కార్మికులు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్

సుభాష్‌నగర్: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గంగాధర్, జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మీ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అదే సమయంలో కలెక్టరేట్‌కు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు సమస్యలు విన్నవించారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా రూ.8కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏదో కంటితుడుపు చర్యగా రూ.2కోట్లు విడుదల చేసి మభ్యపెట్టడం సరికాదన్నారు. మిగిలిన బిల్లులను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా స్లాబ్ రేట్ రూ.15కు పెంచాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వంట షెడ్లు, వంటపాత్రలు తక్షణమే ఇవ్వాలని కోరారు. నాయకులు, కార్మికులు స్వప్న, కాలూరు వనిత, సుజాత, కృష్ణ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సీఎం కేసీఆర్ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మూడ్రోజులు రిలే నిరాహార దీక్షలు చేసి, ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, చక్రపాణి, గంగాధర్, స్రవంతి, గంగామణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామ బస్సు ఆఫీసర్లకు సామగ్రి అందజేత



నిజామాబాద్‌నాగారం: గ్రామ బస్సు ఆఫీసర్లకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో సామగ్రి (బ్యాగ్, టీషర్ట్ , బుక్, బ్యాడ్జి)ని శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ ఉషాదేవి, డిపో మేనేజర్లు ఆనంద్, వెంకటేశం, అధికారులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు



ఎడపల్లి(బోధన్): ఎడపల్లిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బోధన్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు, బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఎడపల్లి గ్రామానికి చెందిన రబ్బానీ పటేల్, అతని అన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఉద్యమంలో జర్నలిస్టులది కీలకపాత్ర

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- గుండారంలో జర్నలిస్టు కాలనీకి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ సిటీ: తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషించారని, వారి కృషిని గుర్తించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామ శివారులో జర్నలిస్ట్ కాలనీకి ఆమె శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ అనేక మంది జర్నలిస్టులు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో పనిచేసే అర్హులైన జర్నలిస్టులందరికీ ఒకేచోట ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించిన మేరకు గుండారం శివారులో ప్రభుత్వం 11 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. రానున్న ఆరు నెలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ చిరకాల స్వప్నం నెరవేరడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల, జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మేయర్ నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, గుండారం సర్పంచ్ లక్ష్మణ్ రావు, జెడ్పీటీసీ సుమలత, ఎంపీటీసీ గంగాధర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి రాజలింగం, కోశాధికారి సందీప్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

పేదలందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సుభాష్‌నగర్: పోడు సాగులో ఉన్న పేదలందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని, రెవెన్యూ భూముల్లో పట్టాదారులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని రైతు సంఘాలు, రైతుకూలీ సంఘాలు, ఆయా పార్టీల నాయకులు తీర్మానం చేశారు. శుక్రవారం ప్రజాపంథా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోడు, సాగుదారులకు హక్కుపత్రాలు ఇవ్వాలని, హైకోర్టు తీర్పు అమల్జేయాలని, రెవెన్యూ భూముల్లో పట్టాదారులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని టీఎన్‌జీవో భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవారాం అధ్యక్షత వహించగా, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి ప్రభాకర్, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఎడ్ల రాములు మాట్లాడారు. జూన్ 24 నుంచి సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. రెవెన్యూ, అటవీ వివాదాలు పరిష్కరించి అందరికీ పట్టాలు ఇస్తామని ప్రకటించి, నేడు కొందరికే పరిమితం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సిరికొండ, భీంగల్, ధర్పల్లి, ఇందల్వాయి, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి, మోపాల్, తదితర మండలాల్లో సాగులో ఉన్న అన్ని వర్గాల వారు దరఖాస్తు చేసుకున్నారని, కానీ గిరిజనులకే పరిమితం చేయడం దారుణమన్నారు. సిరికొండ మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల పరిధిలో రెవెన్యూ సమస్యలు నెలకొని ఉన్నాయని, వీటిని పరిష్కరించి అందరికీ ఒకేసారి పట్టాలు ఇవ్వాలని తీర్మానం చేశామన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పి రామకృష్ణ, ఎస్ సురేష్, గంగాధర్, ముత్తన్న, రమేష్, కిషన్, నరేందర్, సత్యక్క, రమక్క, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

లోతు దుక్కులతో మేలు



నాగిరెడ్డిపేట: వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. రైతులు లోతు దుక్కులు దున్నితే భూసారం పెరగడంతోపాటు చీడపీడలు నివారించవచ్చని నాగిరెడ్డిపేట ఏవో విజయశేఖర్ తెలిపారు. వేసవి దుక్కులు లోతుగా చేపట్టడంతో ల్ల భూమిలోని వివిధ రకాల తెగుళ్ల పురుగులు నశించి దిగుబడి పెరుగుతుందని ఆయన చెప్పారు. పంటలేని సమయంలో వివిధ రకాల పిచ్చిమొక్కలు పెరగడం సహజం. నేలలోని నీరు, పోషకాలను ఈ పిచ్చిమొక్కలు గ్రహించి పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. అనేక రకాల పురుగులు, శిలీంద్రాలకు ఈ కలుపు మొక్కలు ఆశ్రయమిస్తాయి. వేసవిదుక్కులతో నేలలో పాతుకుపోయిన కలుపు మొక్కలు పోతాయి. పంటలను ఆశించే వివిధ రకాల పురుగులు కోత సమయంలో నిద్రావస్థలో ఉంటాయి. ఈ దశలో నేలలో, కొయ్యకాడలలో, ఎండుఆకులలో ఉంటాయి. ఇలా నిద్రావస్థలో ఉన్న పురుగులు తొలకరిలో వేసిన పంటలను ఆశించి తీవ్ర పంట నష్టాన్ని కలిగిస్తాయి. లోతుగా దున్నడంతో నిద్రావస్థలో ఉన్న పురుగుల లార్వాలు, ప్యూపాలు బయట పడతాయి. వాటిని పక్షులు ఏరుకొని తినడంతోపాటు ఎండతీవ్రతకు అవి నశిస్తాయి. ఫలితంగా పంటలకు వాటి బెడద ఉండదు.

తెగుళ్ల యాజమాన్యం

పంటలను ఆశించే వివిధ రకాల తెగుళ్ల రైతుకు తీవ్రనష్టాన్ని కలిగిస్తాయి. ముఖ్యంగా వేరుకుళ్లు, నారుకుళ్లు, కాండంకుళ్లు కలుగజేసే శిలీంద్రాలు నేలలో ఉండి పంటలను ఆశిస్తాయి. వీటి శిలీంద్రబీజాలు భూమిలోపల నిల్వ ఉంటాయి. పంట లేని సమయంలో శిలీంద్రాలు కలుపు మొక్కలపై ఉండి పంట వేసినప్పుడు ఆశించి రైతులకు నష్టాన్ని కలిగిస్తాయి. లోతైన దుక్కులతో భూమి లోపలి పొరల్లో ఉన్న శిలీంద్రబీజాలు, కలుపుమొక్కల విత్తనాలు మట్టితోపాటు నేలపైకి వస్తాయి. ఎండతీవ్రత కారణంగా కలుపు మొక్కల విత్తనాలు నశించడంతోపాటు శిలీంద్రబీజాలు వ్యాపించే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులకు ప్రస్తుత సమయం అనుకూలంగా ఉంటుంది. ఈ నెలలో అడపాదడపా వర్షాలు కురుస్తాయి. వాననీటిని సద్వినియోగం భూములను దున్నుకోవాలి. మూడేళ్లకోసారి వివిధ రకాల నాగళ్లతో 25–30సెంటిమీటర్ల లోతుగా దున్నాలి. దీంతో భూమి లోపలి గట్టిపొరలు చీలిపోతాయి. భారీ వరదలు వచ్చినా నేల కోతకు గురికాదు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొని ఒకరి మృతి



నవీన్ మృతదేహం

బీబీపేట: కుక్కను తప్పించబోయి చెట్టును ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం తుజాల్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ గ్రామానికి చెందిన పాత నవీన్ (28) పనుల నిమిత్తం ఉదయం తుజాల్‌పూర్ గ్రామానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. తుజాల్‌పూర్, బీబీపేట గ్రామాల మధ్య అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్నటువంటి చెట్టును ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కారు బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు..

గాంధారి: కారు బైక్ ఢీకొన్న ఘటనలో మండలంలోని వెంకటాపూర్ తండాకు చెందిన మాలోత్ శోభన్ బాబు(28) మృతి చెందినట్లు ఏఎస్సై గణేశ్ తెలిపారు.వివరాలు.. శోభన్‌బాబు గురువారం రాత్రి తన బైక్‌పై గాంధారి వైపు వెళ్తుండగా మేడిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కరెంట్‌షాక్‌తో వృద్ధురాలు..



పోచవ్వ (ఫైల్)

నాగిరెడ్డిపేట: ఇంటిపైనున్న ట్యాంక్‌లోకి మోటార్ సహాయంతో నీరు నింపే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై మండలంలోని తాండూరు గ్రామానికి చెందిన బొప్పనపల్లి పోచవ్వ(69) మృతి చెందింది. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోచవ్వ తన ఇంటిపైనున్న ట్యాంకులోకి మోటార్ ద్వారా నీటిని నింపుతుండగా ప్రమాదవశాత్తు ఆమె కరెంట్‌షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి కుమారుడు యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి తండాకు చెందిన ధరావత్ రాములు (37) గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ శుక్రవారం తెలిపారు. రాములు రెండు రోజుల క్రితం బైక్‌పై నుంచి పడడంతో చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌కు తరలించగా గురువారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

బోధన్‌టౌన్: బోధన్‌లోని హనుమాన్ ఆలయంలో గురువారం రాత్రి ఓ వ్యక్తి చోరీ చేశాడు. సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఆలయం వెనక భాగం నుంచి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి హుండీ ధ్వంసం చేయడానికి యత్నించాడు. అది పగలకపోవడంతో పక్కనే ఉన్న చిన్న హుండీని పగుల గొట్టి అందులోని చిల్లర తీసుకెళ్లాడు. ఆలయంలోని సీసీ కెమెరాను ధ్వంసం చేసి, బయోమెట్రిక్ మిషన్‌ను ఎత్తుకెళ్లాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయ ఈవో రవీందర్ గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఒకరి అదృశ్యం

దోమకొండ: మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన పోలు నాగరాజు(40) నాలుగు నెలలుగా కనిపించడం లేదని ఆయన భార్య శ్యామల శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు.. మేస్త్రీ పని చేసుకునే నాగరాజు భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గతంలో వెళ్లి తిరిగి వచ్చేవాడు. ప్రస్తుతం నాలుగు నెలలైనా రాలేదని ఆయన భార్య ఫిర్యాదు చేసిందని ఎస్సై తెలిపారు.

తాగొచ్చి వేధిస్తున్నాడని భర్త హత్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేందర్‌రెడ్డి

మోపాల్: నిత్యం తాగొచ్చి తనతో పాటు పిల్లలను వేధిస్తున్న భర్తను హతమార్చిందో భార్య. మండలంలోని న్యాల్‌కల్‌లో జూన్ 4న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితురాలు కట్టకింది స్వరూపను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సీఐ కార్యాలయంలో ఆయన ఎస్సై మహేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కట్టకింది రమేష్, స్వరూప దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. మద్యానికి బానిసైన రమేష్ నిత్యం భార్యతోపాటు పిల్లలను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. అదే క్రమంలో 3న రాత్రి కూడా మద్యం తాగొచ్చి భార్య, కుమారుడిని అకారణంగా కొట్టాడు. దెబ్బలు భరించలేక వారు ఇంటి పక్కనేగల సంఘంలో తలదాచుకున్నారు. వేధింపులు భరించలేక భర్తను హత్య చేయాలని భావించింది. అదే రోజు రాత్రి రమేష్ దాబాపై నిద్రపోయిన తర్వాత తలపై బండరాయితో మోదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం తనకేమీ తెలియనట్లు మృతదేహం వద్ద ఏడ్చింది. అనుమానం వచ్చిన పోలీసులు స్వరూపను విచారించగా నేరాన్ని అంగీకరించింది. కేసు ఛేదించడంలో సహకరించిన ఎస్సై మహేష్, కానిస్టేబుళ్లు మోహన్ గౌడ్, మల్లేష్‌ను సీఐ అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

రామారెడ్డి: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బచ్చబోయిన రాములు(61)కు భార్య లక్ష్మి, కూతురు ఉన్నారు. ఆయన కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారు. లక్ష్మి గురువారం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో రాములు ఉరి వేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

మాచారెడ్డి: అప్పుల బాధతో ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం లక్ష్మిరావులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పుట్ట రాములు (55) ఇళ్ల నిర్మాణంతో పాటు గల్ఫ్ వెళ్లి అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని కొద్ది రోజులుగా ఆందోళన చెందుతున్నాడు. గురువారం పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన రాములు రాత్రి వరకు తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులో ఉరి వేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య లక్ష్మినర్సవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు.